



మంత్రికి సమ్మెనోటీసును అందిస్తున్న ఓబులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

ఓట్ల కొట్లాట..!



నాలుగేళ్లుగా ఓట్ల చేర్పులు, మార్పులపై ఎటువంటి హడావుడి లేదు. కాని ఇది ఎన్నికల సంవత్సరం కావడంతో ఇప్పుడు అందరూ ఓటర్ల జాబితాపై పడ్డారు. రాజకీయపార్టీలు, నేతలు నిశితంగా ఓటర్ల జాబితాలను పరిశీలించుకునే పనిలోపడ్డారు. అటు అధికార వైసిపి, ఇటు ప్రతిపక్ష టిడిపిల మధ్య ఓట్ల లెక్కింపుల్లో సాగుతున్న వివాదాలు తారా స్థాయికే చేరుతున్నాయి. దొంగ ఓట్లు చేరుస్తున్నారు... తమ ఓట్లు తొలగిస్తున్నారంటూ రెండు వైపుల నుంచి విమర్శలు, ప్రతి విమర్శలు చేయడమే కాకుండా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు వరకు వెళ్తున్నాయి.

◆ ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు ◆ వేడెక్కుతున్న రాజకీయాలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఓట్ల తొలగింపు, అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఓటర్ల తొలగింపుపై ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఇది వరకే ఫిర్యాదు చేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం నేరుగా క్షేత్ర స్థాయి పర్యటన సైతం చేసింది. ఇందులో ఇద్దరు జిల్లా అధికారులు, ఇద్దరు విఆర్ఒలపై వేటు కూడా పడింది. నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లను తొలగిచారన్న దానిపై ఈ చర్యలు తీసుకోవడంతో, ఆ పార్టీ శ్రేణులు మరింతగా ఓటర్ల జాబితాపై దృష్టి సారించాయి. దీనిపై ఇప్పటికీ వైసిపి, టిడిపిల మధ్య మాటలయుద్ధం సాగుతూనే ఉన్నాయి. ఓటర్ల జాబితా తయారీలో లోపాలున్నాయని మరోమారు టిడిపి నాయకులు జిల్లా కలెక్టరుతోపాటు, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇటీవలనే ఫిర్యాదు చేశారు. దొంగ ఓట్లు ఉన్నాయని, కొన్ని ఉన్నా తొలగిచారని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పరిశీలన పూర్తి స్థాయిలో జరపకుండా అలాగే ఉంచారన్నది టిడిపి చేస్తున్న ప్రధాన ఆరోపణ. ఈ అంశాన్ని ప్రధానంగా ఉరవకొండ నియోజకవర్గంలో పయ్యావుల కేశవ్ ఆరోపిస్తున్నారు. దీనికి ప్రతిగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ప్రతి ఆరోపణలు పయ్యావుల కేశవ్‌పై చేస్తున్నారు. ఆయనే దొంగ ఓట్లతో ఎమ్మెల్యేగా గెలుపొందారని ఆరోపిస్తున్నారు. అధికారులను బ్లాక్‌మెయిల్ చేసి ఆయన అనుకున్న విధంగా ఓటర్ల జాబితా ఉండే విధంగా చూస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇదే సమయంలో రాప్తాడుకు సంబందించి కూడా అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకుల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. 50 వేల దొంగ ఓట్లను పరిటాల సునీత చేర్చుకున్నారని వైసిపి నాయకులు ఆరోపిస్తున్నారు. అదే సమయలో వైసిపి నాయకులు దొంగ ఓట్లను చేర్చుకుని, టిడిపి ఓట్లను తొలగించారంటూ పరిటాల సునీత ఆరోపిస్తోంది. ఇక అనంతపురం నగరంలోనూ ఇదే రకమైన ఆరోపణలను మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి చేస్తున్నారు. ఇదే విషయంపై ఇటీవల ఆయన ఆర్డీవోకు వినతిపత్రం సైతం అందజేశారు. గుంతకల్లు నియోజకవర్గంలోనూ అక్కడి ఆర్డీవోకు టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఓటర్ల జాబితాపై వాడివేడిగా అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నాయకుల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నేడు, రేపు ప్రత్యేక శిబారాలను ఏర్పాటు చేసి రాజకీయ పార్టీలిచ్చే ఫిర్యాదులను, వినతులను స్వీకరించి వాటిని పరిశీలించి సవరించే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొంది. దీంతో ఈ రెండు రోజులు మరింత వాడివేడిగా ఈ ఓటర్ల జాబితా తయారీ సాగనుంది. అత్యధికంగా తొలగింపు ఓట్లు ఉన్నా, ఒకే ఇంటిలో పదికిపైగా ఓట్లు ఉన్నా వాటన్నింటినీ ప్రత్యేకంగ పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఆదేశించింది.

8 నుంచి అంగన్వాడీల నిరవధిక సమ్మె

మంత్రి ఉషశ్రీచరణ్‌కు సమ్మెనోటీసు అందజేత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

న్యాయమైన సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 8వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్తున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు తెలిపారు. తెలంగాణా కంటే అదనంగా వేతనాలు చెల్లిస్తానన్న జగన్ హామీని అమలుచేయాలని కోరుతూ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్‌కు సమ్మె నోటీస్‌ను అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవితో కలిసి శుక్రవారం నాడు కళ్యాణదుర్గంలోని మంత్రి నివాసంలో వినతిపత్రం, నిరవధిక సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటీ ఇవ్వాలన్నారు. గత ఆరు నెలల నుంచి పెండింగ్‌లో ఉంచిన సెంటర్‌ల అద్దెలు, టలె బిల్లులు తక్షణం చెల్లించాలన్నారు. ఆయాల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. రాజకీయ జోక్యాన్ని నివారించాలన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి వేతనాలు, ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఫేస్ రికగ్నైజేషన్ యాప్ రద్దు చేయాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, బీమా అమలు చేయాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు చెల్లించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 8 నుండి రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ 6వ తేదీ విజయవాడలో చర్చలకు ఆహ్వానిస్తున్నట్లు మంత్రి తెలియజేశారని, ఈ చర్చలు సానుకూలంగా పరిష్కారం కావాలని లేకపోతే డిసెంబర్ 8 నుంచి సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. అంగన్వాడీలు చేసే న్యాయమైన పోరాటానికి ప్రజాస్వామికవాదులు, రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పాతక్క తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ ఎం.గౌతమి



ఓటింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.గౌతిమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రతి ఒక్కరికీ విస్తతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందన కేంద్రం వద్ద ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల అవగాహన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు నిరంతరాయంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ఎలా పని చేస్తాయో సవివరంగా వివరించాలన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా, వారికి అవగాహన కల్పించేలా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆర్డీవో కార్యాలయాలతో పాటు ఐదు నియోజకవర్గ కేంద్రాలలోని తాలూకా కార్యాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. ప్రజలంతా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై నిర్వహించే అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఓటు ఎలా వేయాలో తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఆర్డీవోలు గ్రంధి వెంకటేష్, సి.శ్రీనివాసులురెడ్డి, ఈఆర్ఒలు సుధారాణి, వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కర్, స్పందన తహశీల్దార్ మారుతి, డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, ఎలక్షన్ డిటిలు పాల్గొన్నారు.

సవివరంగా దరఖాస్తులను విచారణ చేసి పరిష్కరిస్తున్నాం

విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం నాడు ఓటర్ల జాబితాపై రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లోకలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఒ గాయత్రీ దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా జిల్లాలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను సవివరంగా విచారించి పరిష్కారం చేస్తున్నామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి పెండింగ్ ఉన్న ఫామ్ 7 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. 18, 19 ఏళ్ల వయసున్న వారు సమర్పించిన దరఖాస్తులను పరిశీలన చేపడుతున్నామన్నారు. రాజకీయ పార్టీల ఫిర్యాదులకు సంబంధించి అప్డేట్ ప్రక్రియ చేస్తున్నామన్నారు. జిల్లాలో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లను నియమిస్తున్నట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు గ్రంధి వెంకటేష్, సి.శ్రీనివాసులురెడ్డి, ఈఆర్ఒలు సుధారాణి, వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కర్, డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, ఎలక్షన్ డిటిలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

జూమ్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ అన్బురాజన్



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న తన ఛాంబర్ నుంచి రక్షక్, బ్లూకోట్స్, హైవే పెట్రోలింగ్ సిబ్బందితోపాటు జిల్లాలోని సి.ఐ, ఎస్ఐలతో ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం గస్తీ తిరుగుతూ అనుమానాస్పద వ్యక్తులను గుర్తించాలన్నారు. నేరం జరిగిన ప్రదేశానికి తక్షణమే వెళ్లడం, రెస్క్యూ చేయడం, రోడ్డు ప్రమాదాల ఘటనలపై తక్షణమే స్పందించి గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించడం వంటి కార్యక్రమాలు ప్రాథమిక బాధ్యతలుగా గుర్తించుకోవాలన్నారు. 24గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల రక్షణను బాధ్యతగా భావించాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో మొదలు శాంతిభద్రతల సమస్యలు, న్యూసెన్స్ ఘటనలు, అగ్ని ప్రమాద ఘటనలు, డయల్-100 కాల్స్, ఈవ్‌టీజింగ్, మార్నింగ్ వాకర్స్ రక్షణ, బ్యాంకులు, ఎటిఎం కేంద్రాలు, బంగారు షాపులు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, తదితర ప్రాంతాల్లో తిరుగుతూ నిఘా ఉంచాలని సూచించారు.

'ఉపాధి' పనులు కల్పించండి : ఎంపిడిఒ

పుట్లూరు : మండలంలోని ఎస్సీ, ఎస్టీలతో వంద రోజులు ఉపాధి హామీ పనులను పూర్తి చేయించాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎస్సీ, ఎస్టీలతోపాటు కూలీలందరితో వంద రోజులు పని పూర్తి చేయించాలన్నారు. అదేవిధంగా ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు జరిగే విధంగా చూసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ భాగ్యలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై అవగాహన

పుట్లూరు : ఆడుదాం ఆంధ్రపై కార్యక్రమంపై ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఏఏ ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు.. ఎవరెవరు ఏ ఆటలు ఆడుతారో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు చేసుకోవాలి

గుత్తి : ప్రత్యేక సమ్మరీ రివిజన్ 2024లో భాగంగా చేర్పులు, మార్పులు ఉంటే ఓటర్లు సరి చేసుకోవాలని తహశీల్దార్ ఎస్.మహ బూబ్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటర్ల జాబితాలో తప్పులు, మార్పులు, చేర్పులు ఉంటే ఫారం 8, మరణించిన వారికి ఫారం 7, నూతన ఓటరు నమోదుకు ఫారం 6 లో ద్వారా ఈనెల 2,3వ తేదీల్లో నమోదు చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆత్మకూరు : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జనార్ధన్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలో హైవేపై వాహనాల తనిఖీ చేపట్టి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించినా, లైసెన్స్ లేకుండా, అతివేగంగా వాహనాలు నడిపినా, ఆటోలు, ట్రాక్టర్లు నడిపిన ఓవర్ లోడ్‌తో వెళ్లిన చర్యలు తప్పవన్నారు. పరిమితికి లోబడి వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఇబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ జనార్ధన

ప్రత్యామ్నాయ విధానాలతోనే వ్యవసాయానికి ఊతం

◆సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ◆జిల్లా వ్యవసాయంపై అధికారులకు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రత్యామ్నాయ విధానాలతో జిల్లా వ్యవసాయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని, ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయంలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని తెలిపారు. 1961-62లో 7,28,753 హెక్టార్లలో ఆహార ధాన్యాల పంటలు సాగు కాగా, 1991-92 నాటికి 1,63,015 హెక్టార్లకు తగ్గిందన్నారు. మూడు దశాబ్దాలకు పైగా జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ 2005-06 నాటికి 8,11,156 హెక్టార్లలో సాగు అయ్యిందన్నారు. ఆ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌తో మొత్తం సాగుభూమిలో 98 శాతం ఈ ఒక్క పంట మాత్రమే సాగు అయ్యిందన్నారు. 2023 నాటికి రెండు లక్షల హెక్టార్లకు పడిపోయిందన్నారు. పంటలు పండక వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. 2004 నుంచి ఉద్యాన పంటలు సాగు పెరిగి 2023 నాటికి 2.29 లక్షల వేల హెక్టార్లకు విస్తరించాయని తెలిపారు. పండ్ల తోటల సాగులో రాష్ట్రంలో జిల్లా ముందు భాగాన ఉందన్నారు. 29 రకాల పండ్లు, పూలు జిల్లాలో పండిస్తున్నారని తెలిపారు. ఈ మార్పులకు అనుణంగా స్థానికంగా మార్కెంటింగ్ సౌకర్యం, పంటల ఆధారిత పరిశ్రమల ఏర్పాటు లాంటి ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలను ప్రభుత్వం చేపట్టాలని కోరారు. జిల్లాలో 31 మండలాలను కరువు పీడిత మండలాలు ప్రకటించాలన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పంట నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పంట నష్టపరిహారం ఉత్తర్వులు సవరించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయాలన్నారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు పంట నష్టపరిహారం అందించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పనులతో పాటుగా గ్రామాలు చెరువులు, కుంటలు, సప్లయ్ ఛానల్స్ పునరుద్ధరణ పనులు చేపట్టి ఉపాధి పనులను విస్తు పరచాలన్నారు. పశు గ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. గొర్రెలకు నీటి కుంటలు ఏర్పాటు చేయాలన్నారు. నిస్సహాయ మహిళలు, వృద్ధులకు ఉచిత రేషన్ పథకం అమలు చేయాలన్నారు. వైద్య సహాయక విధానాలను విస్తృతం చేసి, సంచార వైద్య సదుపాయాలు కొనసాగించాలన్నారు. విద్యార్థుల ట్యూషన్ ఫీజులను రద్దు చేయాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్న యువత ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇప్పించాలన్నారు. ఉరవకొండ, వజ్రకరూరు, విడనకల్లు, గుంతకల్, పెద్దవడగూరు మండలాల్లో రైతులు వేసిన పంటలను కాపాడాలన్నారు. డ్రిప్ స్ప్రింక్లర్‌లు మంజూరు చేయాలన్నారు. ప్రతి మండలానికి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక శీతల గిడ్డంగిని నిర్మించాలన్నారు. అన్ని రకాల పండ్లకు మద్దతు ధర విధానం ప్రవేశపెట్టాలన్నారు. పళ్ల తోటలకు దిగుబడి ఆధారిత వాతావరణ సమగ్ర పంటల బీమా ప్రవేశపెట్టాలన్నారు. బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలన్నారు. హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు ఆర్థిక ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటించాలన్నారు. పెట్టుబడి సాయం కుటుంబ ఆధారంగా కాకుండా రూ.10 వేల సాయం ప్రకటించాలన్నారు. పండ్ల తోటలకు అనుభందంగా పండ్ల రసాల ఫ్యాక్టరీలను జిల్లాలో ఏర్పాటు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు 90 శాతం రాయితితో అందించాలన్నారు. స్పందించిన ఏఓ శ్రీధర్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా ఎం.గౌతమి ద్వారా ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, వి.సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక, ఆర్థిక, భూ సమస్యలు పరిష్కరించాలి

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప - రుద్రంపేటలో సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో సామాజిక, హక్కులు ఆర్థిక, భూమి సమస్యలు పరిష్కరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం నగర సమీపంలోని రుద్రంపేట బైపాస్‌లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ సంతకాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపనున్నట్లు తెలిపారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో నేటికీ దళితులపై దాడులు, అత్యాచారాలు, మానభంగాలు కొనసాగుతున్నాయన్నారు. మణిపూర్‌లో మనువాదుల చేతుల్లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి సమాజానికి సిగ్గుచేటుగా నిలిచిందన్నారు. బిజెపి కేంద్రంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్‌ప్లాన్ చట్టాన్ని రద్దు చేసిందన్నారు. రిజర్వేషన్‌లను అమలు చేయకుండా అనేక ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇది. లౌకిక రాజ్యాంగానికే ప్రమాదం పొంచి ఉందన్నారు. మనువాద భావజాలాన్ని అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో కూడా దళితులపై దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. దళితుల హక్కులను పాలక వర్గాలు కాలరాస్తున్నారని తెలిపారు. దళితులకు భూపంపిణీ చేయడానికి ప్రవేశపెట్టిన భూ చట్టాలను, 9/77 అసైన్డ్ చట్టాలను కాలరాసి దళితులకు భూమి లేకుండా చేస్తోందన్నారు. భూస్వాముల పక్షాన ప్రభుత్వం నిలబడుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా దళితులకు ద్రోహం చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో దళితుల హక్కులు-సామాజిక, ఆర్థిక, భూమి సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా సామాజిక తరగతులు దళిత గిరిజన వ్యవసాయ కార్మికులు వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 4న ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రపతి రాష్ట్రంలో దళితుల స్థితిగతులపై వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్, జిల్లా నాయకులు జీవరత్నం, ఎర్రి స్వామి, అక్కులప్ప, వన్నూరప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గేట్స్ ఆచార్యుడికి డాక్టరేట్

గుత్తి : గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ సహాయ ఆచార్యుడికి డాక్టరేట్ దక్కింది. గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.షావలికి జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసింది. దానికి సంబంధించిన ఉత్తర్వులు అందాయని షావలి తెలిపారు. 'డిడక్షన్ ఆఫ్ కంప్లింగ్ ట్రాన్సిషన్స్ బై యూజింగ్ డిఫరెంట్ ఎన్కోడింగ్ టెక్నిక్స్ ఇన్ విఎల్ ఎస్ఐ సర్క్యూట్స్'అనే అంశంపై తాను సమర్పించిన పరిశోధన పత్రానికి పిహెచ్‌డి వచ్చినటుల తెలిపారు. డాక్టరేట్ రావడం పట్ల గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, ప్రిన్సిపల్ సురయ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇంతియాజ్ బాషా కలిసి షావలిని సన్మానించారు.



డాక్టరేట్ పొందిన షావలిని సన్మానిస్తున్న గేట్స్ యాజమాన్యం

కౌలు రైతులకు రుణాలివ్వాలి

కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య



బ్యాంకు అధికారితో మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు ఇవ్వాలని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 5000 మంది కౌలు రైతులకు ప్రభుత్వం కార్డులు మంజూరు చేసిందన్నారు. అయితే ఇంత వరకూ ఏ ఒక్క రైతుకు కూడా బ్యాంకు రుణాలు ఇచ్చిన పాపానపోలేదన్నారు. కౌలు రైతుల పట్ల అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రభుత్వ బ్యాంకు రుణాలు ఇవ్వడానికి సిఫార్సు చేయాలన్నారు. ముఖ్యంగా కర్ణాటక సరిహద్దులో ఉన్న బొమ్మనహాల్ మండలంలో కౌలురైతులను గుర్తించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. మండలంలో సుమారు 2000 మంది కౌలు రైతులు ఉండగా వారందరికీ కార్డులు ఇవ్వలేదన్నారు. ఆదిశగా రైతులకు అవగాహన కల్పించలేకపోయారన్నారు. అప్పులు చేసి సాగు చేసుకుంటున్న కౌలు రైతులు దిగుబడి రాక అప్పులపాలవుతున్నారన్నారు. అరకొర వచ్చే పంటల నష్ట పరిహారం కూడా భూమి యజమానులకు అందుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయడంతోపాటు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉద్దేహాల్, కొలగానహళ్లి, ఉప్పర కృష్ణాపురం గ్రామాలకు చెందిన కౌలు రైతులు తిప్పేస్వామి, హనుమంతు, హరిజన గంగమ్మ, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ల అక్రమ వాడకంపై దాడులు



సిలిండర్లను సీజ్ చేస్తున్న అధికారులు

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు పామిడి సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న హోటళ్లను శుక్రవారం తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రెండు హోటళ్లలో ఏడు సిలిండర్లను జప్తు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వి.వెంకటరమణ, జి.జయపాల్‌రెడ్డి, శేషగిరిబీ, టి.రాజశేఖర్, ఎల్.రవీంద్రనాథ్, టి.కుళ్లాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అనంత' మైక్రో బయాలజీ ల్యాబ్‌కు ఎన్‌ఎబిఎల్ సర్టిఫికెట్


సర్టిఫికెట్‌ను చూపుతున్న ప్రభుత్వాసుపత్రి ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని మైక్రో బయాలజీ విభాగం హెచ్‌ఐవి ల్యాబ్ నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ లాబొరేటరీస్ అర్హత ప్రశంసాపత్రం సాధించినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు తెలిపారు. హెచ్‌ఐవి వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో భాగంగా వైరల్ లోడ్ ఎస్టిమేషన్ సెంటర్, సిడి4 కణాల పరీక్ష కేంద్రం, స్టేట్ రిఫరెన్స్ లేబరేటరీ, ఐసిటిసి, పిపిటిసిటి కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు అద్భుతంగా పాటించినందుకుగా సర్టిఫికెట్ పొందినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. దీంతో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు సంతోషం వ్యక్తం చేశారు. హెచ్‌ఐవి ల్యాబ్ సిబ్బంది అనురాధ, నాగమణి, దామోదర్, చంద్రమోహన్, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, రేవతి, శ్రీరాములు, గురుప్రసాద్, నరేష్, రూపేష్‌ను మైక్రోబయాలజీ ప్రధాన విభాగాధిపతి శాంతిరెడ్డి, మైక్రోబయాలజీ వైద్యులు హైమావతి, సరోజ, శైలజ, ఉమాదేవి, చంద్రశేఖర్, బసిరెడ్డి ప్రవీణ, ప్రియాంక, రత్న హారిక, సునీల్‌కుమార్, ఆదిరెడ్డి పరదేశినాయుడు, సీనియర్ రెసిడెంట్లు లలితా భవాని, దివ్య, దివ్యతేజ అభినందించారు.

పంటలు నష్టపోయిన రైతుల వివరాలు అందజేయండి

ఎడిఎ లక్ష్మానాయక్


విలేకరులతో మాట్లాడుతున్న ఎడిఎ లక్ష్మానాయక్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ నుంచి రబీ ఈ క్రాప్ బుకింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నియోజకవర్గంలో బొమ్మనహాల్ మినహా 4 మండలాలు(గుమ్మఘట్ట, కణేకల్లు, డి.హీరేహాళ్, రాయదుర్గం) కరువు మండలాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. కావున ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటలు సాగు చేసి నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి శనివారం లోపు అందజేయాలని మండలాల వ్యవసాయ అధికారులు, ఆర్‌బికె సిబ్బందిని ఆదేశించారు. రైతులకు సంబంధించిన భూముల విస్తీర్ణం ఎక్కువగా ఉన్నప్పటికీ ఐదెకరాల లోపు పరిమితితో ఇన్‌పుట్ సబ్సిడీ వర్తించేలా ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయన్నారు. రైతుకు సంబంధించిన బ్యాంకు ఖాతా, ఆధార్ నెంబర్ సరిపోయేలా పరిశీలన చేయాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేయించిన రైతుల వివరాలతో సమగ్ర జాబితా అందజేయాలన్నారు.

దొంగ ఓట్లను కాపాడుకునేందుకే 'కేశవ' తాపత్రయం

అనంతపురం : ఉరవకొండ నియోజకవర్గంలో దొంగఓట్లను కాపాడుకునేందుకే ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తాపత్రయపడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. శుక్రవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఓట్ల వెరిఫికేషన్ చేపట్టిందన్నారు. ఈ వెరిఫికేషన్ సజావుగా జరగకుండా ఉండేందుకు అధికారులను బెదిరించేలా మట్లాడుతున్నారని ఆరోపించారు .గత ఎన్నికల్లో చనిపోయిన వారి ఓట్లను కూడా వేయించుకున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కేశవ్ స్పందించి నిష్పక్ష పాత విచారణకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు వీరన్న, రమణ పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

రాయదుర్గం : ఈ నెల 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందని, కావున పోలింగ్ బూత్‌లలో బూత్‌స్థాయి అధికారులు ఓటర్లకు అందుబాటులో ఉండాలని తహశీల్దార్ ఓబులేసు, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. ఆయా బూత్ స్థాయి అధికారులు తమ పోలింగ్ బూత్ ఓటర్ల జాబితా, అవసరమైన దరఖాస్తు ఫారాలతో అందుబాటులో ఉండాలన్నారు. దరఖాస్తుదారులకు అవసరమైన ఫారం-6, 7, 8 దరఖాస్తులు ఇచ్చి భర్తీ చేసిన వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఒకే డోర్ నెంబర్లో 10 కంటే ఎక్కువ మంది ఓటర్ల పేర్లు జంక్ ఓటర్లు ఉంటే అలాంటి వాటిని ఫారం-8 కింద నమోదు చేయాలన్నారు. బిఎల్‌ఒలు రిజిస్టర్‌ను నమోదు చేయాలన్నారు. నిబంధనలు పాటించని బిఎల్‌ఒలపై చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

జాతీయ పోటీలకు శింగనమల విద్యార్థులు

శింగనమల : ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన అంతర జిల్లాల క్రీడా పోటీల్లో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అండర్-17 విభాగంలో పాఠశాలకు చెందిన ఎం.ఇమ్రాన్‌అలీ ద్వితీయ స్థానం సాధించాడు. బి.కార్తీక్ అండర్-14 అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. అదేవిధంగా ఆర్చరీ పోటీల్లో కె.గోవర్ధన్‌రెడ్డి నాలుగవ స్థానంలో నిలిచి త్వరలో గుజరాత్‌లోని నడయాడ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, మండల విద్యాశాఖాధికారులు నరసింహరాజు, శివప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు పి.నందకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర' : ఎంపిడిఒ

బుక్కరాయసముద్రం : మండలంలోని క్రీడాకారులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ తేజోష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకూ ఆయా సచివాలయాల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15ఏళ్ల పైబడి, 60ఏళ్లలోపు వారు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : శ్రావణిశ్రీ


మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న బండారు శ్రావణిశ్రీ

గార్లదిన్నె : తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని సంజీవపురం గ్రామంలో 'బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చల్లా నాగరాజు, చిదంబరి దొర, సామల మధు, గుత్తా హరి, రమణప్ప, శివశంకర్‌రెడ్డి, ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

శింగనమల : మండలంలోని గుమ్మేపల్లి గ్రామానికి చెందిన బాల అంకన్న కుటుంబానికి మంజూరైన వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేశారు. బాల అంకన్న ఆకస్మికంగా మృతిచెందడంతో విషయం తెలుసుకున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, వాలంటీర్ మునెప్ప శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందించారు.

టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడికి సన్మానం

అనంతపురం : టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన పోతుల లక్ష్మీనరసింహులును శుక్రవారం స్థానిక ఎన్జీవో హోంలో కుంచపు వడ్డే వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా లక్ష్మీనరసింహులకు శాలువాను కప్పి, పుష్పగుచ్ఛం అందించి భారీ కేక్ కోయించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి సత్యసాయి జిల్లా అధ్యక్షులు తాడాల నాగభూషణం, ఉపాధ్యక్షులు సిరివాటి వన్నూర్, అధికార ప్రతినిధి నిట్టూరు శివాజీ, నగర అధ్యక్షులు పూల బాషా, ప్రధాన కార్యదర్శి సాయికుమార్, టైలర్స్ యూనియన్ నగర అధ్యక్షులు ముత్యాలు, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షులు మంజుల నారాయణ, బాషా, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


పోతుల లక్ష్మీనరసింహులును సన్మానిస్తున్న నాయకులు

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన చాలా అవసరమని మేయర్ మహమ్మద్ వసీం, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని మేయర్‌తోపాటు జెడ్పీ ఛైర్‌పర్సన్ ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ టవర్‌క్లాక్, సుబాష్‌రోడ్డు మీదుగా సప్తగిరి సర్కిల్‌కు చేరుకుంది. సప్తగిరి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి హెచ్‌ఐవి నియంత్రణకు పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ హెచ్‌ఐవితో జీవిస్తున్న వారిలో ధైర్యం నింపడంతోపాటు ప్రజల్లో అవగాహన పెంచి, చైతన్యం కలిగించడానికి ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 1న ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎయిడ్స్‌కు మందు లేదన్నారు. అవగాహనతోనే నివారణ సాధ్యమన్నారు. ముఖ్యంగా యువత ఎయిడ్స్ నివారణ అవగాహన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో హెచ్‌ఐవి నివారణలో కృషి చేస్తున్న ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌ఎస్‌ఎస్, ఎసిసి ప్రోగ్రాం ఆఫీసర్లకు వ్యాసరచన, వకృత్వ, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, కమల్‌భూషణ్, డిఎంహెచ్‌ఒ భ్రమరాంబదేవి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి డాక్టర్ అనుపమ జేమ్స్, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా సూపర్‌వైజర్ రమణ, ఆర్డీటీ డైరెక్టర్ సిరప్ప, డెమో ఉమాపతి, డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ గంగాధర్, అనంత నెట్‌వర్క్ పాజిటివ్ ప్రెసిడెంట్ వీరాంజనేయులు, రిడ్స్ కిష్టప్ప, ఎన్‌వైకె కోఆర్డినేటర్ భరత్, ఆర్‌ఆర్‌సి కోఆర్డినేటర్ డాక్టర్ గిరిధర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విష్ణుప్రియ, ఎన్‌సిసి ఆఫీసర్ రంగనాథ్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సిబ్బంది మురళి, నారాయణస్వామి, లింక్ వర్కర్స్ ప్రోగ్రాం రమేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం : ఎస్‌కెయు ఫార్మాసూటికల్ సైన్సెస్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.సత్యసౌమ్య ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ ర్యాలీలో ఎస్‌కెయు ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డి.మురళీధర్‌రావు, ఎస్‌కెయు క్రాఫ్ ప్రిన్సిపల్ జి.సోమశేఖర్, స్కూసెట్ ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ధనుంజయ, రామిరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే నగరంలోని పెద్దాసుపత్రి డెర్మటాలజీ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ కెఎస్‌ఎస్ వెంకటేశ్వరరావు, ఎఆర్‌టి నోడల్ ఆఫీసర్ మనోరాజు, వైస్ ప్రిన్సిపల్ శ్రీదేవి, షారుణ్ సోనియా, ఆర్‌ఎంఒ పి.పద్మజ, సునీత, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, రజినీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ మంజుల, ఎఎన్‌ఎం కళాశాల ప్రిన్సిపల్ యశోద, డాక్టర్ వికిషోర్‌కుమార్, డిప్యూటీ ఆర్‌ఎంఒ జి.హేమలత, డెర్మటాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సి.నీలిమ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.విజయకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్ లెక్కల శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవంలో వక్తలు


గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గుత్తి : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో భాగంగా శుక్రవారం గుత్తిలో హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.దీప్తి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్ వరకు కొనసాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విష్ణుమూర్తి, డాక్టర్ ఎల్లా రాముడు, న్యాయవాది వీసీ.గంగాధర్, టిఐ ప్రాజెక్ట్ మేనేజర్ జి.రమేష్, ఎంఈపి సందీప్, ఏఎన్‌ఎం కవిత, ఓఆర్ డబ్ల్యు లు డి.కృష్ణవేణి, ఎస్.శంషాద్, జి.రాధాకుమారి, ఆర్.జోత్స్న, పి.జోత్స్న, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గౌతమి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ లోకనాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, పిహెచ్‌ఎన్ అరుణ, సూపర్‌వైజర్లు సూర్యకళ, గాయత్రి, కృష్ణమోహన్, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పామిడి : పామిడి గవర్నమెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం పట్టణంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ అధికారి పిఆ బి.వెంకటనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందు లేదన్నారు. కేవలం నివారణ మాత్రమే అన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ అసిస్టెంట్ తుల్జారాం, అధ్యాపకులు గోపీ, అక్కులన్న, బంధన పాల్గొన్నారు.


పామిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



అనంతపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న మహమ్మద్ వసీం, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

రాయదుర్గం : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఐసిటిసి విభాగం, మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ కార్యాలయం వద్ద ర్యాలీని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప జెండా ఊపి ప్రారంభించగా వినాయక కూడలి వరకూ సాగింది. అక్కడ ప్రభుత్వ విప్ ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, గౌని ఉపేంద్రరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞానసుధ, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఐసిటిసి కౌన్సిలర్ కృష్ణమూర్తి, మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ మేనేజర్ అశోక్, ఎంఇఒ వెంకటరమేష్, కౌన్సిలర్లు గోవిందరాజులు, వీరస్వామి, శ్రీలక్ష్మి, శారద, వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప, శివ, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, మున్సిపల్ వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల : ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యులు సాదియా ఆర్య ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యునాని డాక్టర్, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని సిద్ధరాచర్ల అంగన్వాడీ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి సాకే రామాంజనేయులు మాట్లాడుతూహెచ్‌ఐవి భూతం చాపకింద నీరులా విస్తరిస్తోందన్నారు. కావున ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాకే కుళ్లాయప్ప, డీలర్ మాధవరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి అమృతాంజలి, మహిళా పోలీస్ భాగ్య, అంగన్వాడీ టీచర్ సువర్ణ, ఆశా సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు, బొమ్మనహాల్ పిహెచ్‌సిల పరిధిలోని వైద్య ఉప కేంద్రాల సిబ్బంది ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బొమ్మనహాల్‌లో జడ్పి హైస్కూల్ నుంచి పోలీస్ స్టేషన్ సర్కిల్ వరకు, శ్రీధరఘట్టలో జడ్పి హైస్కూల్ నుంచి చెరువు కట్ట వరకూ ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి డాక్టర్ శ్రీలక్ష్మీ మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ ఎయిడ్స్, నివారణ, జాగ్రత్తలపై అవగాహన అవసరం అన్నారు. కార్యక్రమంలో ఆయా పిహెచ్‌సిల డాక్టర్లు, నర్సులు, సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని వైద్యాధికారి రాజేంద్ర సూచించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ ప్రమీల, నూర్ మహమ్మద్, స్టాఫ్‌నర్స్ యోగలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ నూర్‌బాషా, ఫార్మాసిస్ట్ సరళ, లింక్ వర్కర్ దివ్య భారతి, ఎంఎల్‌హెచ్‌పి ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమం విషయంలో రాజీవద్దు : ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో ఎలాంటి రాజీపడొద్దని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులు, పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులతో వెల్ఫేర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం జిల్లాలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. ప్రధానంగా పోలీసు ఆసుపత్రి, పోలీస్ ఇళ్ల స్థలాల అభివృద్ధి, సిపిసి క్యాంటీన్, రక్షక్ స్కూలు, తదితర కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య, విద్య, విధులు, తదితర అంశాల పరంగా చేపట్టాల్సిన సంక్షేమ చర్యలను అందర్ని సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. అలాగే త్వరలో జిల్లా పోలీసుశాఖ చేపట్టనున్న పోలీస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహణపై చర్చించారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, ఎ.హనుమంతు, ఎ.ఆర్ డీఎస్పీ మునిరాజు, డీసీఆర్బీ సి.ఐ విశ్వనాథ్‌చౌదరి, ఆర్ఐ రాముడు, జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనాధికారి శంకర్, వెల్ఫేర్ ఆర్‌ఎస్‌ఐ రమేష్‌నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులునాయుడు, రమణ, ఎస్పీ సిసి ఆంజనేయప్రసాద్, ఐటి కోర్ టీం మంజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేస్తున్న మంచిని చూడాలి

'వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్'లో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని చూడాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం నగరంలోని కోవూరునగర్, హమాలీకాలనీల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆయా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు సంబంధించి బోర్డులతోపాటు వైసీపీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు వీరా రామకృష్ణారెడ్డి, చింతకుంట మధు, మధుసూదన్‌రెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, సైపుల్లా బేగ్, బాబాఫక్రుద్దీన్, రహంతుల్లా, సాకే కుళ్లాయిస్వామి, షేక్ ఖాజా, రఫీ, ఓబిరెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీనివాసులు, మహానందరెడ్డి, మీనాక్షమ్మ, నాగార్జునరెడ్డి, అల్లి ఖాన్, వెంకటరెడ్డి, రామకృష్ణ, హనుమంతురెడ్డి, వలి, నగర పాలక సంస్థ సెక్రటరీ సంగం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉరవకొండ : వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో సిఎం జగన్ చేస్తున్న మంచిని ప్రజలు గమనించాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని నింబగల్లు గ్రామంలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన బోర్డుతోపాటు వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి చంద్రమౌళి, ఎంపిపి నరసింహులు, వైస్ ఎంపిపి శ్రీనాథ్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సుంకన్న, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజనాథ్, సర్పంచి సునీత, ఎంపిటిసి సోంపల్లి ఈశ్వర్, పిఎసిఎస్ డైరెక్టర్ చిదంబరంనాయుడు, నాయకులు జెట్టి రమేష్, ఓబులేసు, హనుమప్ప, శివరాజ్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : వచ్చే ఎన్నికల్లో గెలవడానికి టిడిపి నాయకులు ఇచ్చే అబద్ధపు హామీలకు మోసపోవద్దని వైసిపి పట్టణ అధ్యక్షుడు జావిద్ ఖాద్రీ సూచించారు. శుక్రవారం పట్టణంలోని బుక్కపట్నం వీధి సచివాలయ పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాన తమ సచివాలయ పరిధిలో ప్రజలకు రూ.12,10,78,186 లబ్ధి చేకూరిందన్నారు. గతంలో నాయకులు కేవలం గెలవడానికి మాత్రమే అబద్ధపు హామీలు ఇచ్చేవారన్నారు. అదే వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఆయా పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో కూడా జగన్‌నే సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబయ్య, బాబా, రఘునాథ్‌రెడ్డి, హబీబ్, మహమ్మద్, గురుశంకర్, గఫూర్, కృష్ణయ్య, వార్డు కన్వీనర్ మధు, యువ నాయకులు పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


సంఘీభావం తెలుపుతున్న నాయకులు, చేనేతలు

ప్రజాశక్తి-ఉరవకొండ

చేనేత పరిశ్రమ అభివృద్ధే ధ్యేయంగా సిఎం జగన్ విశేష కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద మంజూరైన పెన్న అహోబిలేశ్వర చేనేత క్లస్టర్ అభివృద్ధిపై అహగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉరవకొండలో ఒక క్లస్టర్ ఉన్నపటికీ మరింత మంది కార్మికులకు లబ్ధి కలగాలని ప్రభుత్వంతో మాట్లాడి మరో క్లస్టర్‌ను మంజూరు చేయించినట్లు తెలిపారు. 320 మంది సభ్యులుగా ఉండే ఈ క్లస్టర్‌కు రూ.1.60కోట్లు మంజూరు కాగా మొదటి విడతగా రూ.59 లక్షలు విడుదలైనట్లు వివరించారు. క్లస్టర్ సహకారంతో సభ్యులు అభివృద్ధి చెందాలన్నారు. సిఎం జగన్‌కు చేనేతలంటే ఎంతో ప్రేమ అన్నారు. ఇందులో భాగంగానే జగన్ తన పుట్టినరోజు వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించి 80 వేల చేనేతల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అనంతరం క్లస్టర్‌కు 20 సెంట్లు స్థలం కేటాయించిన సర్పంచి లలిత, ఇఒ గౌస్ సాహెబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత జిల్లా ఎడిఎ అప్పాజీ, వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, చేనేత నాయకులు మాజీ ఎంపిపి చంద్రమ్మ, ఎంసి.నాగభూషణం, చంగల మహేష్, మిడతల చంద్రమౌళి, గట్టు ఎర్రిస్వామి, కొత్తపల్లి హరనాథ్, నిమ్మల వెంకటరమణ, వేల్పుల వాసుదేవుడు, కాసుల అంజి, రఫీ, బీరే శివ, అమర్‌నాథ్, కరూరు వెంకటేష్, ఎంపిపి నరసింహులు, వైస్ ఎంపిపి శ్రీనాథ్‌రెడ్డి, జడ్పిటిసి పార్వతమ్మ, పిఎసిఎస్ ఛైర్మన్ షేక్షావలి, చేనేత సహాయ అధికారి నరసింహారెడ్డి, క్లస్టర్ సీడీ ఇ విగ్నేష్, చేనేత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే పద్మావతి

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం పక్కన సుమారు రూ.30లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకారం అందజేసిన ఎంపీ, ఎమ్మెల్యేకు వైసీపీ సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా గూగూడు కుళ్లాయిస్వామి సన్నిధిలో నిర్వహించిన కుంకుమార్చనలో ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, వైస్ ఎంజిజి వెంకటలక్ష్మి, నాయకులు మిద్దె కుళ్లాయప్ప, సుప్రియ, రాంభూపాల్‌రెడ్డి, రామాంజనేయులు, కుళ్లాయిరెడ్డి, శ్రీరాములు, అమీర్‌బాషా, పద్మాకర్‌రెడ్డి, వెంకటరమణమ్మ, వెంకటనారాయణమ్మ, సబిరా, శివశంకర్‌రెడ్డి, ఎమ్మెస్ నాయుడు, శివయ్య, రఘువీరారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, గోపాల్ మోహన్, నాగరాజు, వెంకట్రామిరెడ్డి, శ్రీరాములు, రమణయ్య, గోపాల్ రమేష్, వెంకట రాముడు, బయపు రెడ్డి, తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఒ దివాకర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆశ్వర్థనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష నాయకుల వినతి

మండల కేంద్రంలో నడిబొడ్డున ఉన్న కూతలేరు వంతెనపై దుమ్ముధూళిని నియంత్రించాలని వామపక్ష నాయకులు ఎంపి, ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి పడేలా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, సిపిఐ మండల కార్యదర్శి గంగాధర్, నాయకులు రామ్మోహన్, రమేష్, కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చెరువులో పడి బాలుడు మృతి


మృతిచెందిన చిన్నారి జనార్ధన్

గుత్తి : చేపల వల చూడ్డానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కాశీరావు, పెద్దక్క దంపతుల ఆఖరి సంతానం జనార్ధన్ (5) తన పెద్దనాన్న కిష్టప్ప చెరువులో చేపలు పట్టడానికి కట్టిన వలను చూడ్డానికి స్నేహితుడితో కలిసి వెళ్లాడు. అది చూసిన కిష్టప్ప అక్కడి నుంచి ఆ పిల్లలని గదమాయించి పంపాడు. అయితే పిల్లలు మరో దారి వెంట చెరువు దగ్గరకు వెళ్లారు. చేపల వలను పట్టుకుని చూస్తూ ప్రమాదవశాత్తు జనార్ధన్ చెరువులోని గుంతలోకి పడిపోయాడు. గమనించిన మరో బాలుడు అక్కడి నుంచే పరుగున వెళ్లి విషయాన్ని గ్రామస్తులకు తెలిపాడు. వెంటనే గ్రామస్తులు చెరువులోని గుంతలోకి దిగి గాలించారు. గుంతలో ఓ మూలన ఉన్న జనార్ధన్ తన తండ్రి కాశీరావుకు చిక్కాడు. ఆ బాలున్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మతి చెందాడని నిర్ధారించారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ కుమారుడు మరణించడం పట్ల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.